ఆశలు ఆవిరి


శ్రీకావేరిరాజుపురంలో పూత లేకుండా బోసిపోయిన మామిడి తోట

- రాలిపోతున్న మామిడి పూత, పిందెలు
- దిగుబడిపై అనుమానం
- ఆందోళనలో అన్నదాతలు

పాలసముద్రం: ఫలాల్లో రాజుగా పేరొందిన మామిడి ఈ ఏడాది రైతాంగానికి చేదు రుచిని చూపించనుంది. దిగుబడి గణనీయంగా తగ్గిపోవడంతో పాటు ధరలు ఎంత వరకూ ఉంటాయో తెలియని అయోమయ పరిస్థితి. దిగుబడి తగ్గిన కారణంగా రికార్డు స్థాయిలో ధరలు పలికినా మామిడి రైతులు నష్టాల ఊబిలో కూరుకోక తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మామిడిని అధికంగా సాగు చేస్తారు. రెండేళ్లుగా రైతులు ఆశించిన దిగుబడులు లేక పోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది ఆది నుంచే వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో పూతలు అరకొరగా వచ్చాయి. పూతలు తగ్గిపోవడంతో దిగుబడి పడిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రాలిపోతున్న పూత

ప్రస్తుతం మామిడి తోటల్లో 50 శాతం వరకు పూత రాగా ఉన్నవాటికి పిందె, కాయలు నిలబడడం లేదు. తెగుళ్ల భయం వెంటాడుతోంది. పిందెలు, కాయలు రాలిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత రాలిపోవడం, జిగురు కారిపోవటం, గెలల్లో నుంచి పిందెలు పడిపోయి రాలిపోతున్నాయి. ఏ తెగులు వచ్చిందో తెలియక ఏ మందు పిచికారీ చేయాల్లో అర్థంకాక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

తగ్గనున్న దిగుబడులు

ఏటా తగ్గిపోతున్న దిగుబడి భారీగా పతనమవుతున్న ధరలతో రైతులు అల్లాడిపోతున్నారు. దిగుబడి వచ్చే సరికి కేవలం 30 శాతానికే పరిమితిమైనట్లు రైతులు చెబుతున్నారు. మామిడి దిగుబడి తగ్గడానికి రైతాంగం అనేక కారణాలు చెబుతున్నారు. అధికారులు రైతులకు అవగాహన కల్పించకపోవడం భూగర్భ జలాలు తగ్గిపోవడం, తెగుళ్ల ఆశించడంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. 5 నుంచి 7 సంవత్సరాల మొక్కలు ఎకరానికి 5 టన్నులు దిగుబడి రావాల్సి ఉండగా 2.50 నుంచి 3 టన్నుల వరకు పడిపోయాయి. అలాగే 10 సంవత్సరాల మొక్కలు అయితే 6 నుంచి 8 టన్నులు రావాల్సి ఉండగా కేవలం 5 టన్నులకు పడిపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

మండలం	మామిడిసాగు విస్తీర్ణం(హెక్టార్లలో)
గంగాధరనెల్లూరు -	1830
కార్వేటినగరం -	1231
పెనుమూరు -	1345
శ్రీరంగరాజుపురం -	1143
పాలసముద్రం -	1023
వెదురుకుప్పం -	1568

మామిడి రైతులను ఆదుకోవాలి



రెండెకరాల్లో మామిడి సాగు చేస్తున్నా. ఈసారి పూత సరిగ్గా రాకపోవడంతో దిగుబడులు తగ్గాయి. సరైన వర్షాలు లేక చెట్లు దెబ్బతిన్నాయి. అంతేగాక బోర్లలో నీరు ఇంకిపోవడంతో పూర్తిగా నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి మామిడి తోట రైతులను ఆదుకోవాలి.

–ఆర్.సుబ్రమణ్యం, శ్రీకావేరిరాజుపురం, మామిడి రైతు

ప్రారంభం నుంచి కష్టాలే



ఈసారి మామిడి రైతులకు ప్రారంభ నుంచే కష్టాలు మొదలయ్యాయి. ప్రకృతి సరిగ్గా సహకరించకపోవడంతో ఉన్న కాయలు దెబ్బతింటున్నాయి. ఈ ఏడాది అప్పులే మిగిలేలా ఉన్నాయి. ప్రభుత్వం ఆదుకోకపోతే పండ్ల తోటల రైతులకు ఆత్మహత్యలే శరణ్యం.

–మైథిలి, సింహరాజుపురం, మామిడి రైతు

దిగుబడి తగ్గడం వాస్తవమే



తీవ్ర వర్షాభావ పరిస్థితులు, పూత దశలో అధిక చలిగాలు వీచడంతో మామిడి పూత రాలి పంట దిగుబడులు తగ్గాయి. అలాగే మార్కెట్లో ధరలు హెచ్చు తగ్గులతో ఇబ్బందులు పడుతున్నారు. నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి వారికి న్యాయం జరిగేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

–ఢిల్లీ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి

క్లుప్తంగా

రేషన్ కోసం అవస్థలు


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పాలసముద్రం: ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ సరుకుల కోసం అష్టకష్టాలు పడుతున్నామని బుధవారం సన్నగుంట, శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడ, గుండుబావి గ్రామానికి చెందిన లబ్ధిదారులు పాలసముద్రం రైతు భరోసా కేంద్రం ఎదుట నిరసన చేపట్టారు. వీరికి పాలసముద్రం రైతు భరోసా కేంద్రంలో నెల నెలా రేషన్ సరుకులు అందిస్తున్నారు. ప్రతి నెలా 2 కిలోమీటర్లు వచ్చి రేషన్ సరుకుల కోసం నిరీక్షిస్తున్నా డీలర్ అందుబాటులో ఉండకపోవడంతో అగచాట్లు పడుతున్నామని వాపోయారు. అధికారులు స్పందించి రేషన్ సరుకులు సక్రమంగా అందించాలని కోరారు.

ఆటిజం పరికరాల పంపిణీ


వినికిడి పరికరాలను అందిస్తున్న ఎంఈఓలు

నింద్ర: వైకల్యం ఉన్న పిల్లలకు వినికిడి పరికరాల యంత్రాలను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ ఆటిజంపై నివారణ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. అందులో ఎంఈవోలు వసుమతిదేవి, శ్రీధర్ రాజు మాట్లాడుతూ, పిల్లలు చిన్నతనం నుంచి ఆటిజం వ్యాధి బారిన పడకుండా ఉండడానికి తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు వినికిడి యంత్రాలతోపాటు విద్యాసామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు వాసు, వేంకటేశులు పాల్గొన్నారు.

ఘనంగా కొడి ఉత్సవం


ఊరేగింపుగా వెళుతున్న ఉత్సవర్లు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో బుధవారం సాయంత్రం కొడి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను ఉంచి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను గ్రామాలలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామాలలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించిన తరువాత వార్షిక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త రాధాకృష్ణారెడ్డి తెలిపారు.

శక్తి యాప్‌పై అవగాహన అవసరం


మాట్లాడుతున్న డీఎస్పీ విజయ్‌కుమార్

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా పోలీసు డీఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. బాలికలకు, మహిళలకు రక్షణ కల్పించడానికి శక్తి యాప్ ఒక ఆయుధమని దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ యాప్ ద్వారా ప్రమాదంలో ఉన్న మహిళలు నిమిషాల వ్యవధిలో పోలీసుల నుంచి రక్షణ పొందవచ్చని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మహిళా ఎస్‌ఐ నాగ సౌజన్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన

శ్రీరంగరాజుపురం: ఆటిజం సకాలంలో గుర్తిస్తే లక్షణాలను తగ్గించవచ్చు అని ప్రధానోపాధ్యాయుడు మోహన్ అన్నారు. బుధవారం ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా ఎస్ఆర్ పురం భవిత కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆటిజం ఉన్న పిల్లలకు రోజూ ఫిజియోథెరపీ చేస్తే కొంత మెరుగు పడవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, చరణ్ పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా అక్రమ వెంచర్లు


ఇల్లత్తూరులో వేసిన లే అవుట్

విజయపురం: మండలంలో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో తమిళనాడుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనుమతులు లేకుండా లేఅవుట్ వేసి అమాయక ప్రజలకు విక్రయించేస్తున్నారు. ప్లాట్ తీసుకొన్న తరువాత ఇల్లు కట్టుకోవడానికి అధికారుల వద్దకు వెళితే ఆ లే అవుట్లకు అనుమతి లేదని చెప్పడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతోనే అక్రమ లే అవుట్లు పుట్టుకొస్తున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు అక్రమ లేఅవుట్‌పై ప్రత్యేక దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ నీటిని పరీక్షించి వివరాలు ఇవ్వండి


చైర్మన్ సమక్షంలో కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న అఖిలపక్ష నేతలు

నగరి: ఈ నీరు తాగడానికి అనువైందేనా పరీక్షించి చెప్పాలంటూ రసాయన రంగు నీటి వ్యతిరేక ఉద్యమ అధ్యక్షులు గజేంద్రన్ మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన బుధవారం అఖిలపక్ష నేతలతో మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని నీటిని అందించారు. చైర్మన్ పీజీ నీలమేఘంకు వివరాలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో భూగర్భజలాలు కలుషితమయ్యాయని, బోర్లు వేసి నీరువాడుతున్నా సోరియాసిస్, కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నట్లు వివరించారు. ఈ నీరు తాగడానికి గానీ, వంటకు వాడటానికి గానీ, స్నానానికి గానీ మంచిదా కాదా పరీక్షించి తెలియజేయాలని కోరారు. ఆ నీటిలో హానికరమైన పదార్థాలు ఉన్నయో లేవో తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు బీడీ భాస్కర్, బాబు పాల్గొన్నారు.

ర్యాలీలు, బహిరంగ సమావేశాలు నిషిద్ధం

నగరి: డివిజన్ పరిధిలో ఈ నెల 30వ తేదీ వరకు పోలీస్ యాక్టు 30, 30(ఎ) అమలులో ఉంటుందని డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకారణంగా ర్యాలీలు, రోడ్లపై గుమిగూడటాలు, బహిరంగ సమావేశాలు నిషిద్ధమన్నారు. అందరూ దీనికి సహకరించాలని కోరారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు


కరకంఠేశ్వర ఆలయం

నగరి: స్థానిక కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో గురువారం నుంచి పంగుణోత్తర తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం సూర్యప్రభ వాహన సేవ నిర్వహిస్తారు. 4వ తేదీన చంద్రప్రభ వాహనం, 5వ తేదీ అధికార నంది వాహనం, 6వ తేదీ శేషవాహనం, 7వ తేదీ వృషభ వాహనం, 8వ తేదీ గజవాహనం, 9వ తేదీ రథోత్సవం, 10వ తేదీ కల్యాణోత్సవం, 11వ తేదీ రావణేశ్వర వాహన సేవలు ధ్వజావరోహణ కార్యక్రమంతో వేడుకలు పరిసమాప్తం అవుతాయని ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు. ప్రతి రోజూ ఆలయంలో అభిషేక పూజలు నిర్వహిస్తామన్నారు.

చీమలవారి వంకపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టండి


కుంగిన వంకను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

వడమాలపేట (విజయపురం): తిరుపతి–చెన్నై జాతీయ రహదారిపై వడమాలపేట వద్ద చీమలవారి వంకపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. వర్షం కురిసిన ప్రతి సారీ చీమలవారి వంకపై ప్రమాదకర స్థాయిలో నీళ్లు పారుతుంది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. ఇటీవల వర్షానికి కాజ్‌వే ఇరవై అడుగుల మేర కుంగిపోవడంతో గత ఏడాది డిసెంబర్ 16వ తేదీ తిరుపతి జిల్లా కలెక్టర్, ఆర్అండ్‌బీ అధికారులు కాజ్‌వే పరిశీలించి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. అయితే శాశ్వత బ్రిడ్జి నిర్మాణం చేపట్టి, సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆటిజంను అదుపు చేయవచ్చు


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పుత్తూరు: చిన్నతనంలోనే ఆటిజమ్‌ను గుర్తిస్తే దానిని అదుపుచేయవచ్చని ఎంఈఓ తిరుమలరాజు తెలిపారు. పట్టణంలోని భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఆటిజమ్ పిల్లల్లోనూ ఎదుగుదలను చూడవచ్చునని స్పష్టం చేశారు. ఇలాంటి పిల్లలను తల్లిదండ్రులు భవిత కేంద్రాలకు తీసుకువచ్చి మెరుగైన సేవలను పొందాలని పిలుపునిచ్చారు. మాటలు రాని వారు సైతం శాస్త్రవేత్తలుగా ఎదిగారని తెలిపారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 బాల సుబ్రమణ్యం, టీచర్లు ఆనంద్, సూర్యకుమారి, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ

వెదురుకుప్పం: మండల కేంద్రంలో పెనుమూరు, దేవళంపేట కూడలిలో ఎస్‌ఐ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికుల కోసం నీటి వసతిని కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ.. ఎండల తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది మట్టి రోడ్డు కాదు తారు రోడ్డే. వడమాలపేట మండలం అప్పలాయిగుంట సమీపంలో రోడ్డు పక్కన నివాసం ఉంటున్న కుటుంబాలు ఇంటి ముందు మట్టి తోలుకున్నాయి. క్రమంగా మట్టి కాస్తా ఆ తారు రోడ్డును కప్పేసింది. దీంతో వాహనదారులు మట్టిలో జారి కిందపడి గాయాలపాలవుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని మట్టిని తొలగించాలని కోరుతున్నారు. –విజయపురం

ఆక్రమణలో ఆర్అండ్‌బీ స్థలాలు


ఆర్ అండ్ బీ స్థలంలో నిర్మించుకున్న భవనాలు

విజయపురం: మండలంలో ఆర్అండ్ బీ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. పన్నూరు సబ్‌స్టేషన్ నాలుగు రోడ్ల కూడలి వద్ద నగరి, నాగలాపురం, కనకమ్మసత్రం రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. పెద్ద పెద్ద మిద్దెలు కట్టుకొని, అంగళ్లు నిర్మించుకున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. నేటికీ చాలా దుకాణాలు నిర్మించిన స్థలాలకు పట్టాలు లేవు. అయిన అనధికారకంగా పెద్ద భవనాలు నిర్మించుకుంటున్నారు. సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోలేదు.

పెరిగిన భూమి విలువ

పన్నూరు సబ్‌స్టేషన్ నాలుగు పక్కల రియల్ ఎస్టేట్ వ్యాపారులు లే అవుట్ వేయడంతో భూముల విలువ బాగా పెరిగింది. ఒక సెంటు భూమి సుమారు రూ.50వేలు పలుకుతుంది. రోజు రోజుకూ భూముల విలువ పెరుగుతుండడంతో ఆర్అండ్‌బీ రోడ్డును ఆక్రమించుకుని దుకాణాలు నిర్మించుకున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ప్రధాన రహదారికి ఇరువైపులా 10 నుంచి 30 అడుగుల మేర ఆర్అండ్‌బీ స్థలం దురాక్రమణల పాలైందని రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని వినియోగించుకోండి


శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కార్వేటినగరం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. అనంతరం ప్రజలు తీసుకొచ్చిన వినతులను స్వీకరించారు. అనంతరం నేతన్నలకు ప్రభుత్వం మంజూరు చేసిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొల్లాగుంట గ్రామంలో, మండల కేంద్రంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ చంద్రమౌళి, తహసీల్దార్ నాగరాజు, అధికారులు, టీడీపీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారూ.. ఆలకించండి!

నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గారు.. మీరు అధికారులతో సమీక్షలకే పరిమితమవుతారా? అభివృద్ధి పనులు జరిగేలా చూస్తారా? గత సమీక్ష సమావేశం వల్ల మాకు ఒరిగింది ఏమీ లేదు. కనీసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే దాదాపు పనులు పూర్తయి ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్, డీఎస్పీ భవనాలతో పాటు ఈశ్వరాలయం పుష్కరిణిని అయినా ప్రారంభిస్తారా? మూలకోన వద్ద దెబ్బతిన్న మంచినీటి పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి దాహార్తిని తీర్చగలరా? అంటూ పుత్తూరు ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- నేడు అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం
- గత సమీక్ష వల్ల ఒరిగింది శూన్యం
- మూలకోన పైపులైన్ల మరమ్మతులు ఎప్పటికో?
- అర్బన్ హెల్త్, డీఎస్పీ భవనాలు, పుష్కరిణి ప్రారంభానికి నోచుకునేనా?
- ఇసుక, బియ్యం, గంజాయి, గుట్కా వ్యాపారాలు ఆగేదెన్నటికో?



మూలకోన వద్ద దెబ్బతిన్న పైపు లైను, పుత్తూరు పట్టణ నడిబొడ్డున ఆగిన పుష్కరిణి పనులు

పుత్తూరు: నగరి నియోజకవర్గ స్థాయి అధికారుల సమీక్షా సమావేశం గత ఏడాది నవంబర్ 10వ తేదీన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పుత్తూరులో నిర్వహించారు. ఈ సమీక్షలో అక్రమ వ్యాపారాలను ఉక్కుపాదంతో అణచివేయాలని ఆదేశించారు. శ్మశాన స్థలాల కోసం ప్రజలు రోడ్డుకెక్కడమేమిటని ప్రశ్నించారు. సమీక్ష నిర్వహించి 5 నెలలు గడిచింది. ఆనాడు అధికారులను ఆదేశించిన విధంగా పనులు ఏవీ చక్కబడిన దాఖలాలు లేవు. ఈదఫా సమీక్షలోనైనా అధికారులకు స్థిరమైన లక్ష్యాలను నిర్దేశించి, వాటి అమలుకు దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గత సమీక్షలో ఆదేశించినా కార్యరూపం దాల్చని పనులు

- నగరి నుంచి తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది.
- కొంత మంది రేషన్ డీలర్లు బియ్యం బదులుగా కొంత సొమ్ము ఇచ్చి పంపుతున్నారు.
- బియ్యాన్ని తమిళనాడుకు తరలించేందుకు తమ వద్దే డంప్ చేసిపెట్టుకొంటున్నారు.
- పుత్తూరు పట్టణంలో గంజాయి, గుట్కా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతూనే ఉంది.
- శ్మశాన స్థలాల కోసం రోజుకో గ్రామం నుంచి ప్రజలు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు.
- పుత్తూరు, నగరి పట్టణాల్లో ట్రాఫిక్ స్తంభించిపోతోంది.
- పల్లె పండుగ పేరిట ఒక్క పుత్తూరులో చేపట్టిన 54 రోడ్డు పనుల్లో 39 మాత్రం పూర్తి
- మిగిలిన వాటిని వివిధ కారణాలతో ఆపేశారు. 33 డ్రైనేజీ పనుల్లో ఒక్కటి కూడా ప్రారంభం కాలేదు.

పుత్తూరు ప్రజలు తక్షణం కోరుకుంటున్నవి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు పట్టణానికి ప్రత్యేకంగా రెండు అర్బన్ హెల్త్ సెంటర్లను మంజూరు చేయించారు. ఒక్కొక్కి రూ.80లక్షలతో చేపట్టిన పనుల్లో గోవిందపాళెం వద్ద అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. వినాయకపురం రోడ్డులో నిర్మించిన సెంటర్ పనులు దాదాపు పూర్తయ్యాయి. చివరి దశ పనులు పూర్తి చేసి ప్రారంభిస్తే ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువవుతాయి.

పుష్కరిణి ప్రారంభించండి

పుత్తూరు పట్టణ నడిబొడ్డున అర్ధంతరంగా ఆగిపోయిన పుష్కరిణి (కోనేరు) పనులను పూర్తి చేసి ప్రారంభించాలని భక్తులు కోరుతున్నారు. ఇందుకోసం దేవదాయ శాఖ రూ.25 లక్షలు మంజూరు చేయగా ప్రజలు సైతం మరో రూ.25 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ పనులతో పాటు ప్రజల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులు సైతం రాజకీయ, కోర్టు అడ్డంకులతో ఆగిపోయాయి. వీటిని ప్రారంభించడం ద్వారా పట్టణం అందంగా తయారవడంతో పాటు, వ్యాపార గదుల కోసం లక్షలు వ్యయం చేసిన బాధితులకు ఊరట కలుగుతుంది.

పటిష్ట భద్రత కోసం డీఎస్పీ కార్యాలయం

జిల్లాల పునర్విభజనలో భాగంగా పుత్తూరు మండలం తిరుపతి జిల్లాలో కలవడంతో పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్‌ను రేణిగుంట డివిజన్‌లోకి విలీనం చేశారు. అయితే ఆనాటి మంత్రి ఆర్కే రోజా కృషి ఫలితంగా పుత్తూరు సబ్ డివిజన్ మళ్లీ కొనసాగుతోంది. నూతన భవన నిర్మాణం కోసం రూ.కోటి మంజూరు చేయించడంతో నూతన భవన నిర్మాణ పనులు సైతం దాదాపు పూర్తయ్యాయి. డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించడం ద్వారా డివిజన్ పరిధిలో పోలీస్ వ్యవస్థ మరింతగా బలోపేతం అవుతుంది.


ప్రారంభోత్సవానికి నోచుకోని అర్బన్ హెల్త్ సెంటర్

దాహార్తి తీర్చేందుకు మూలకోన నీరు

సుమారు రూ.3.2 కోట్లతో ఏర్పాటు చేసిన మూలకోన ప్రాజెక్టుతో పుత్తూరు పట్టణానికి తాగునీరు అందుతూ వచ్చింది. 2023 డిసెంబర్‌లో మిగ్‌జాం తుఫాను కారణంగా మూలకోన నుంచి పుత్తూరు వరకు ఉన్న 7 కిలోమీటర్ల పైపులైన్లలో 2 కిలోమీటర్ల మేర కొట్టుకుపోయాయి. దీంతో మూలకోన నుంచి నీటి సరఫరా ఆగిపోయి అప్పటి నుంచి పుత్తూరులో మంచినీటి సమస్య కొనసాగుతూనే ఉంది. త్వరలోనే టెండర్లు పిలుస్తామంటున్న అధికారుల మాటలు కార్యరూపం దాల్చడం లేదు. ఇకనైనా మరమ్మతులు చేపట్టి పట్టణ ప్రజల దాహార్తి తీర్చాల్సి ఉంది.